కథ

# కొత్తదారి

పులిపాక కనకదుర్గ

నిద్రలేవటంతోనే అలసటగా అనిపించింది భువనేశ్వరికి.

ఓపిక లేక అలాగే పడుకుని ఉండిపోయింది.

ఎప్పటిలాగా ఏడు గంటలకు వచ్చింది గౌరి.

"ఏంటమ్మమ్మా ఒంట్లో బాలేదా?" వస్తూనే భువనేశ్వరి దగ్గరకు వచ్చి పరిశీలనగా చూస్తూ అడిగింది.

అవునన్నట్టుగా తలాడించింది భువనేశ్వరి.

"అలాగే పడుకునుండిపోతే నీరసం ఎలా తగ్గుతుంది చెప్పు?" మెత్తగా కోప్పడి తనే దగ్గరుండి ముఖం కడిగించి, టీ తెచ్చిచ్చింది గౌరి.

టీ తాగేక కాస్త సత్తువ వచ్చినట్టు అనిపించింది భువనేశ్వరికి.

"ఇప్పుడు కాస్త ఫరవాలేదు. నువ్వెళ్లి పనులు చూసుకోమ్మా" నిదానంగా అంది గౌరితో.

"సరే, మీరు చెప్పారు కాబట్టి ఇప్పటికి వెళ్తున్నాను. అరగంట తరువాత మళ్లీ వస్తాను. అప్పటికి మీరు స్నానం చేసి శుభ్రంగా కనిపించాలి. అలా కాదనుకోండి. ఈ పూటకు వంట ఉండదు. అందరూ పస్తుండాల్సిందే" భువనేశ్వరిని మంచం మీద కూర్చోబెట్టి, వెళ్ళేముందు అంది గౌరి.

ఇరవైయేళ్ల గౌరి చలాకీగా ఉంటుంది.

అంతకుమించిన కరుణను సేవాశ్రమంలోని వృద్ధుల పైన చూపిస్తుంటుంది.

'ఏ జన్మ ఋణానుబంధమో' గౌరి వెళ్లిన వేపే చూస్తూ ఎప్పటిలాగే అనుకుంది భువనేశ్వరి.

చెప్పినట్టుగానే అరగంట కాగానే వచ్చింది గౌరి.

అప్పటికే స్నానం చేసి శుభ్రమయిన చీర కట్టుకుని ధ్యానం చేసుకుంటున్న భువనేశ్వరిని గమనించి తృప్తిగా నవ్వుకుని వెనుదిరిగింది.

భువనేశ్వరి ఉంటున్న సేవాశ్రమం ఓ చిన్నపాటి వృద్ధుల శరణాలయం. ఆర్నెల్లు అవుతోంది భువనేశ్వరి సేవాశ్రమానికి వచ్చి.

వాస్తవానికి సేవాశ్రమంలో ఉంటున్న వారెవరూ అనాథలు కారు. అందరికీ పిల్లలూ, నా అనుకునే వాళ్లు ఉన్నారు. అనేకానేక కారణాల వల్ల దిక్కులేనివారిలా అక్కడ తలదాచుకుంటున్నారు.

భువనేశ్వరి భర్త టీచర్‌గా పని చేసి రిటైర్ అయ్యాడు. రిటైర్ అయ్యేనాటికి కూతురి పెళ్లి చేసి, తన బాధ్యతలు సక్రమంగా నిర్వర్తించానన్న తృప్తిని మిగుల్చుకున్నాడు.

కూతురూ, అల్లుడూ ఇద్దరూ డాక్టర్లే.

మొదట్లో ఇక్కడే నర్సింగ్‌హోం పెడ్దామనుకున్నారు. అనుకోకుండా అమెరికాలో మంచి అవకాశాలు రావటంతో అక్కడికి వెళ్ళి సెటిలయిపోయారు.

కొడుక్కి పెళ్లి చేసి, కోడలు వచ్చాక నిశ్చింతగా ఉండవచ్చన్న వృద్ధదంపతులకు తీవ్రమయిన నిరాశ ఎదురయ్యింది. డాలర్ల మోజులో వాళ్లు కూడా ఏడాది తిరక్కుండానే ఫారిన్ వెళ్లిపోయారు.

పిల్లలు దూరమయినా భర్త ఉన్నంతకాలం భువనేశ్వరిని ఒంటరితనం బాధించలేదు. భర్త ఆకస్మిక మరణం భువనేశ్వరిని బాగా కృంగదీసింది.

తండ్రి పోయాక ఇండియాకు వచ్చిన పిల్లలకు భువనేశ్వరిని ఏం చెయ్యాలో తోచలేదు.

తల్లి వారికి ఓ సమస్య అయ్యింది.

వెంట తీసుకెళ్లటం సాధ్యపడదు. అలాగని ఇక్కడి వృద్ధాప్యంలో ఒంటరిగా వదిలివెళ్లటం శ్రేయస్కరం కాదు.

అనేక తర్జనభర్జనల అనంతరం ఆమెను సేవాశ్రమంలో ఉంచటం అన్ని విధాలా శ్రేయస్కరం అని నిర్ణయించారు.

తనకు సంబంధించిన నిర్ణయం తీసుకునే సమయంలో తన పాత్ర ఏమీ లేకపోవటం బాధాకరంగా తోచింది భువనేశ్వరికి.

అలా ఆమె ఇష్టాయిష్టాలతో ప్రమేయం లేకుండా సేవాశ్రమానికి వచ్చింది భువనేశ్వరి.

సేవాశ్రమం పేరుకు తగ్గట్టు ఓ చిన్నపాటి ఆశ్రమం.

మొత్తం అంతా కలిపి ఇరవైమంది దాకా ఉంటారందులో. ఎవరి గది వారికి విడిగా ఉంది. చక్కటి భోజన వసతి ఉంది. అందుబాటులో వేన్, అవసరమయినప్పుడు, పిలవగానే వచ్చే డాక్టర్లు ఉన్నారు. పై పన్లకు కూడా మరొక ఇద్దరు ఉన్నారు. వాటిలో రెండుసార్లు భజనలు, ఏదయినా ఆధ్యాత్మిక ఉపన్యాసం ఉంటాయి. భువనేశ్వరికి వచ్చే పెన్షన్లో మూడు వేలు నెలకు ఆశ్రమానికి వెళ్లేలా ఏర్పాట్లు చేసి, చెక్కుబుక్కు భువనేశ్వరి చేతిలో పెట్టి వెళ్లిపోయేరు పిల్లలు.

జీవితం అంధకారమయమయ్యింది. భువనేశ్వరికి సర్వస్వం కోల్పోయినట్టుగా అనిపించింది. కట్టుకున్న భర్త కానరాని లోకాలకు వెళ్లిపోయాడు.

ఉన్న పిల్లలు గోళానికి ఆవలివేపున ఉన్నారు. తను బ్రతికి ఉండగా తిరిగి వాళ్లను చూడగలనా అన్న సందేహం కలిగింది ఆమెకి. ఆ దిగులు క్రమంగా పెరగసాగింది.

'ఇదేనా జీవితం అంటే' అనిపించింది.

ఒకప్పుడు పిల్లాపాటలతో, భర్తతో అందమయిన పూల తోటలా అనిపించిన జీవితం ఇప్పుడు శిథిలమయిన కోటలా వెగటుగా ఉంది.

'సంతోషం ఇంత క్షణ భంగురమా!'

ఇంతకాలం తనకు అంతా ఉన్నారని, అన్నీ ఉన్నాయని ఆనందించింది. గర్వపడింది. కానీ ఆ బంధాలన్నీ నీటిబుడగ చందమన్న విషయం కొత్తగా అనుభవంలోకి వచ్చింది.

అందరూ ఉండి కూడా ఏకాకిలా జీవిస్తున్న జీవితం మీద రోత కలిగింది.

ఒకప్పుడు తమ ఇంట్లో ఏం జరగాలన్నా తన చేతుల మీదుగానే జరిగేది.

ఇప్పుడు ఏమీ చేయలేని తన నిస్సహాయత మీద తనకే జాలి వేసింది.

వేదన హెచ్చింది. మనిషి జీవచ్ఛవమయ్యింది.

ఆశ్రమంలో ఇమడలేక ఆరోగ్యం కూడా దెబ్బతింది.

సేవాశ్రమానికి వచ్చిన ఆర్నెల్లల్లో, రోజులో చాలా భాగం తన గదికే పరిమితమయ్యింది.

వచ్చిన కొత్తల్లో వారానికో మారు పిల్లల దగ్గర్నించి ఫోన్లు వచ్చేవి. ఇప్పుడు ఫోన్లో ఆ కాస్త పలకరింపు కూడా కరువయ్యింది.

పిల్లలు తనను పట్టించుకోవటం పూర్తిగా మానేశారన్న వాస్తవం ఆమెకు మరింత దుఃఖాన్ని మిగిల్చింది. దాంతో మరింత కృంగిపోయింది. జీవితం అంటే విరక్తి కలిగింది. ఆమె దుఃఖాన్ని మరింతగా పెంచటానికన్నట్టు రెండురోజుల క్రితం మహేంద్ర వచ్చేడు.

మహేంద్ర తన భర్త దగ్గర చదువుకున్న విద్యార్థి.

పేదరికం వల్ల చదువు కొనసాగించటం కష్టమయితే తన భర్తే ఆర్థికంగా అతనిని ఆదుకున్నాడు. దాదాపు రెండు సంవత్సరాలపాటు తమ ఇంటనే ఉండి చదువుకున్నాడు. ఆ కృతజ్ఞతతోనే ఇప్పుడు భువనేశ్వరిని పలకరించటానికి వచ్చాడు.

ఆమె పరిస్థితి అతనిని ఎంతగానో కలచివేసింది.

ఎవరూ పట్టించుకోకపోయినా గుర్తుపెట్టుకుని, తన గురించి ఆరా తీసి, ఫారిన్ నుండి రాగానే పలకరించటానికి వచ్చిన మహేంద్రను చూడగానే కన్నీరు ప్రవాహమయ్యింది భువనేశ్వరికి. దయనీయంగా ఉంది ఆమె పరిస్థితి.

భువనేశ్వరికి పిల్లల పద్ధతికి మనసులోనే నొచ్చుకున్నాడు మహేంద్ర.

"బాధపడకండమ్మా. మీ అబ్బాయి ఉండేది నాకు దగ్గరలోనే. నేను అతనితో మాట్లాడ్తాను. అసలు వాళ్లే క్రిస్ట్‌మస్ సెలవులకు మిమ్మల్ని చూడటానికి రావచ్చు"

ఓదార్పుగా అన్నాడు.

వెళ్లేముందు పదివేలు భువనేశ్వరి చేతిలో పెట్టాడు.

"నాకెందుకు బాబూ డబ్బు?" వైరాగ్యంగా అంది భువ

నేశ్వరి.

"ఉంచండమ్మా! మీ మనవలు వచ్చినప్పుడు ఏదయినా కొనివ్వచ్చు"

ఆలోచనల్లో పడిపోయిన భువనేశ్వరి ఒక్కసారిగా ఇహానికొచ్చింది.

ఏదో గుర్తొచ్చినదానిలా తలగడ తీసి చూసింది.

పదివేలు భద్రంగా ఉన్నాయి.

ఆ డబ్బు చూడగానే మనవలు గుర్తొచ్చారు.

సెలవులకు వచ్చినప్పుడు వాళ్లకు తన గుర్తుగా ఏద యినా కొనివ్వాలని నిర్ణయించుకుంది భువనేశ్వరి. మన సులో ఏ మూలో వాళ్లు రారేమోనన్న దిగులు రోజు రోజుకీ పెరిగింది.

వాళ్ల జ్ఞాపకాలతో మరికొన్ని నెలలు భారంగా గడి చేయి.

ఓరోజు అకస్మాత్తుగా ఊడిపడ్డ చూడామణిని చూసి ఆశ్చర్యపోయింది. చూడామణి భువనేశ్వరి చిన్ననాటి నేస్తం.

చిన్నతనంలో ప్రాప్తించిన వైధవ్యం కారణంగా చూడా మణి జీవితం మోడువారిపోయింది.

చూడామణితో పోల్చుకుని ఒకప్పుడు తన అదృష్టానికి ఎంతగానో మురిసిపోయింది భువనేశ్వరి.

ఇప్పుడు తన పరిస్థితి చూడామణి కంటే మెరుగ్గా లేదని గ్రహించింది.

ఇలాంటి దయనీయ స్థితిలో చిన్ననాటి నేస్తాన్ని కలవటం అవమానకరం గానూ, బాధాకరంగానూ అనిపించింది భువనేశ్వరికి.

"నీ గురించి ఎలా తెలిసిందనుకుంటున్నావా?" భువ నేశ్వరి ఆలోచనలు చదివినట్టుగా అడిగింది చూడామణి.

"మహేంద్ర మా అన్నయ్యగారి అల్లుడు" క్లుప్తంగా అంది, భువనేశ్వరి మౌనంగా ఉండిపోవటంతో.

ఏవో మాటల సందర్భంలో తన ప్రస్తావన వచ్చి ఉంటుందని ఊహించింది భువనేశ్వరి.

"ఎలా ఉన్నావు?" కొద్దిక్షణాల విరామం తర్వాత ఆప్యాయంగా ప్రశ్నించింది చూడామణి.

"ఎలా ఉంటాను! అయినవారికి దూరమై జీవచ్ఛవంలా ఉన్నాను"

"ఎందుకు భువనా అంతలా కృంగిపోవటం? ఇవన్నీ జీవితంలో సహజమయిన పరిణామాలు. అయినా నీకి ప్పుడు ఏం తక్కువయ్యిందని అంత నిస్పృహ?" మామూ లుగా అంది చూడామణి.

"ఇంకా ఏం కావాలి? కుటుంబం లేకుండా, అయిన వాళ్లకు దూరంగా, దిక్కులేని అనాథలా జీవించటం కూడా ఓ బ్రతుకేనా" ఏవగింపుగా అంది భువనేశ్వరి.

భువనేశ్వరి మనోగతం అర్థమయ్యింది చూడామణికి.


"అయినవాళ్లంటే ఎవరు భువనా?" ప్రశ్నించింది.

అయోమయంగా చూసింది భువనేశ్వరి.

"నీ కుటుంబం, పిల్లలూ వీళ్లేగా నీ దృష్టిలో అయినవాళ్లు. వాళ్లు అయినవాళ్లు అయినప్పుడు, వాళ్లుండగా నీకీ దుస్థితి వచ్చి ఉండకూడదే!"

చూడామణి మాటలకు క్రోధం, అవమానభారం కల గాపులగంగా కమ్ముకున్నాయి భువనేశ్వరిని.

"ఇలా దెప్పిపొడవటానికేనా వచ్చింది?" నిష్ఠూరంగా అంది.



"నిన్ను నొప్పిస్తే క్షమించు భువనా. నువ్వెంతో కృంగిపోయావని విని నీక్కాస్త స్వాంతన కలిగిద్దామని వచ్చాను"

చూడామణి ఊరడింపుతో కాస్త సేదదీరింది భువనేశ్వరి మనసు.

"కృంగిపోక సంతోషంగా ఎలా ఉండమంటావు మణీ. మనవలూ, మనవరాళ్లతో కాలక్షేపం చెయ్యాల్సిన వయసులో ఇలాంటి జీవితం ఎంత బాధాకరమో అనుభవించిన వారికే తెలుస్తుంది" నిర్వేదంగా అంది భువనేశ్వరి.

"పొరపాటు భువనా. కుటుంబ వ్యవస్థలోనే సంతోషం ఉందనుకోకు. ఆ మాట కొస్తే అయినవాళ్లతో ఉంటున్నవారంతా సంతోషంగా ఉంటారంటావా! కుటుంబంలోనే సంతోషం ఉందని నీ మనసుని నువ్వు కండిషన్ చేసుకున్నావు. అదే నీ బాధకు కారణం. నిజానికి సంతోషానికి నిర్వచనం కానీ, నమూనా కానీ లేవు. మనసు విశాలమయి నదయితే సంతోషం లేనిదెక్కడ చెప్పు?"

చూడామణి మాటలు పూర్తిగా అర్థం కాలేదు భువనేశ్వరికి.

"అవును భువనా, చిన్నతనం నుండి దేనికి నువ్వు ప్రాధాన్యత ఇస్తున్నావో అది నీకు దక్కకపోయేసరికి దిక్కుతోచనిదానిలా దిగాలు పడ్డావు. జీవితం అనేక అధ్యాయాల సమాహారం. ఒక అధ్యాయం ముగిసిపోతే మరొక అధ్యాయం మొదలవుతుంది. అయినవాళ్లు దూరమయ్యారనేగా నీ బాధ! నీ చుట్టూ ఉన్న నీలాంటి వారు నీవాళ్లు కాదా చెప్పు. మనసు గట్టి పరచుకో. నీతో ఉన్నవాళ్లతో కలిసిపోయి కొత్త జీవితాన్ని ప్రారంభించు" అనునయంగా చెప్పింది చూడామణి.

"అది జరిగే పనేనా?" నిరాశగా అంది భువనేశ్వరి.

"ఎందుకు సాధ్యపడదు? మనసు కుదుట పరుచుకుంటే తప్పనిసరిగా సాధ్యపడుతుంది. ఎంతకాలం ఇలా కృశించిపోతావు? ఎంత దిగులుపడ్డా నువ్వు మళ్లీ వెనకటి జీవితాన్ని గడపలేవు. ఇప్పట్లో నీ పిల్లలు తిరిగిరారు. నువ్వా అక్కడికి వెళ్లలేవు."

చూడామణి మాటలు భువనేశ్వరిని చాలా ప్రభావితం చేశాయి.

ఆశ్రమం నుండి అనుమతి తీసుకుని చూడామణి దగ్గరకు వెళ్లింది.

చూడామణి చిన్నపాటి ఆశ్రమాన్ని నిర్వహిస్తోంది. పదిమంది అనాథ బాలికలు, మరో పదిమంది వృద్ధుల దాకా అందులో ఉన్నారు.

ఒకే కుటుంబంలా కలిసిపోయిన వారిని చూసి విస్మయానికి లోనయ్యింది భువనేశ్వరి.

ఉదయం ప్రార్థనతో ఆశ్రమవాసుల దినచర్య మొదలవుతుంది.

ఎనిమిది గంటలకు ఉపాహారం.

పిల్లలంతా ఓ గంటసేపు ఆశ్రమ ఆవరణలో ఉన్న తోట పని చేసి దగ్గరలో ఉన్న స్కూలుకు వెళ్తారు. వంటకు ప్రత్యేకంగా మనిషి ఉంది. పెద్దలంతా కూరలు కోసివ్వటం, ఆశ్రమాన్ని శుభ్రపరచటంలాంటివి వంతులవారీగా చేస్తారు.

ఎక్కడా పొరపొచ్చాలు లేవు.

ఎవరికి ఏ కష్టమొచ్చినా, చిన్నపాటి సుస్తీ చేసినా మిగిలినవారు మేమున్నామంటూ పక్కనుంటారు.

పనులన్నీ అయ్యాక అందరూ ఓ చోట చేరి కబుర్లాడుకుంటారు. కొద్దిసేపు సరదాగా టి.వి. చూస్తారు.

మధ్యాహ్నం పిల్లలు భోజనాలకు వస్తారు. అందరూ కలిసి భోం చేశాక పిల్లలు స్కూలికెళ్తే, పెద్దలు కాసేపు విశ్రాంతి తీసుకుంటారు.

సాయంత్రం పిల్లల ఆటపాటలతో ఆశ్రమం అంతా సందడిగా మారిపోతుంది. చీకటి పడ్డాక పిల్లలు పుస్తకాలు ముందేసుకుంటే, పెద్దలు తిరిగి వంట పనిలో నిమగ్నమవుతారు.

ఓపిక లేనివారు చిన్న చిన్న పనులు చేస్తారు.

అక్కడున్న ఎవరికీ నా అన్న వారు లేరు. కానీ అలా ఫీలవ్వరు. అందరూ తమ వాళ్లేనని అనుకుంటారు. అందుకే కాబోలు ఆనందం అక్కడ స్థిరనివాసం ఏర్పరుచుకుంది. ఒంటరితనం, వేదనలకు అక్కడ తావు లేదు.

ఆదివారం వచ్చిందంటే పండగ వాతావరణం నెలకొని ఉంటుంది. మిగిలిన రోజుల్లో చేసుకోలేని పనులు పూర్తిచేసుకోవటం, పిల్లలూ, పెద్దలూ ఒకచోట చేరి చిన్న, చిన్న గేమ్సు ఆడుకోవటం లాంటివి చేస్తారు.

చూడామణిని చూస్తుంటే అబ్బురమనిపించింది భువనేశ్వరికి.

సంతృప్తి, సంతోషం తన స్వంతం అన్నట్టుగా ఉంటుంది చూడామణి.

"ఎవరన్నారు సంతోషం ఒకే విధంగా ఉంటుందని!"

అందరినీ తనవారిగా భావించే మనో వైశాల్యం ఉండాలేగానీ, ఆనందానికి కొదవేముంది? సంతోషం, దుఃఖం మనసునిబట్టేనని అర్థమయ్యింది ఆమెకు.

సంతోషం భగవదత్తమయినది. భగవంతుడిని చేరుకోటానికి ఎలా అనేక మార్గాలు ఉన్నాయో, సంతోషం పొందటానికి కూడా అనేక మంచి మార్గాలు ఉన్నాయి. యవ్వనంలో లభించిన, నాది అనుకునే కుటుంబం అదృష్టవంతులకు కడదాకా ఉండవచ్చు. ఒకవేళ అలా జరగకపోయినా కృంగిపోకుండా తనదయిన ప్రపంచాన్ని ఏర్పరుచుకుని, అందులోనే ఆనందాన్ని పొందవచ్చునన్న ఓ కొత్త జీవనసూత్రాన్ని చూడామణి ఎంత చక్కగా తెలియజేసింది.

ఎవరో చేత్తో తీసివేసినట్టుగా దిగులూ, పిల్లల మీద బెంగా మటుమాయం అయ్యాయి భువనేశ్వరికి.

చూడామణి దగ్గర నాలుగు రోజులు గడిపి వచ్చిన భువనేశ్వరిలో అనూహ్యమయిన మార్పు చోటు చేసుకుంది.

ఎప్పుడూ దిగాలుగా ఉంటూ, తన గదికే పరిమితమయ్యే ఆమె ఇప్పుడు తక్కిన ఆశ్రమవాసులతో కలివిడిగా ఉంటోంది.

పంచుకున్న కొద్దీ దుఃఖం ఎంత పలుచబడుతుందో ఆమెకు అనుభవపూర్వకంగా అర్థమయ్యింది.

ఆశ్రమంలో జరిగే అన్ని కార్యక్రమాల్లో ఆమె ముందు వరుసలో ఉంటోంది.

సత్కాలక్షేపానికి నలుగురినీ కలుపుకుని గుళ్లూ గోపురాలు దర్శిస్తోంది.

అడపాదడపా చూడామణిని కలుస్తోంది. వీలునుబట్టి చూడామణి కూడా భువనేశ్వరిని చూడటానికి వస్తుంది.

స్నేహితురాలి రాక భువనేశ్వరికి అత్యంత ఆనందాన్ని ఇచ్చే విషయం.

నెలకోసారి కొడుక్కీ, కూతురికీ ఫోన్లు చేస్తుంది. ఇదివరలో తను పట్టించుకోని స్నేహితులకు, బంధువులకు ఫోన్లు చేసి యోగక్షేమాలు పట్టించుకుంటోంది.

పండగలకూ పబ్బాలకూ అయినవారికి గ్రీటింగ్స్ పంపిస్తోంది.

ప్రపంచం ఇంత విశాలమయినదని తెలియక 'అంతా అయిపోయిందని' దుఃఖించింది తనేనా అని ఆశ్చర్యం కలుగుతోంది భువనేశ్వరికి ఇప్పుడు.

* * *

తిరుపతి వెంకన్నను దర్శించుకుని తిరిగొచ్చేరు చూడామణి, భువనేశ్వరి తదితరులు.

సమవయస్కులతో ప్రయాణం, దేవదేవుని దర్శనం భువనేశ్వరికి అలౌకికమయిన అనుభూతిని మిగిల్చాయి.

సేవాశ్రమానికి తిరిగి వస్తూండగా అంది భువనేశ్వరి "మణీ! కొంచెం కారుని పక్కగా ఆపమని చెప్పు"

డ్రైవర్‌తో చెప్పి కారుని ఆపించి 'ఎందుకన్నట్టుగా' చూసింది చూడామణి.

"మా ఆశ్రమంలో గౌరి అని మనసున్న మంచి అమ్మాయి ఉంది. ఆ బంగారుతల్లి పెళ్లికి ఓ చిన్న బంగారునగను కానుకగా ఇద్దామని" చూడామణితో కారు దిగుతూ చెప్పింది భువనేశ్వరి.

చాన్నాళ్ళ క్రితం మహేంద్ర ఇచ్చిన పదివేలు 'సంతోషం' అన్నట్టు గరగరలాడాయి. స్నేహితురాళ్లిద్దరూ నగల షాపు దిశగా అడుగులేశారు.

